క్లుప్తంగా

అంగన్‌వాడీ కేంద్రం తనిఖీ



కారెంపూడి: మండలంలోని కాకానివారిపాలెం అంగన్‌వాడీ కేంద్రాన్ని ఎంపీపీ మేకల శారదా శ్రీనివాసరెడ్డి, ఎంపీడీఓ జి శ్రీనివాసరెడ్డి సోమవారం ఆకస్మిక తనిఖీ చేశారు. పిల్లలకు పౌష్టికాహారం సక్రమంగా పెట్టడం లేదని, కనీసం కోడి గుడ్లు కూడా అందించడం లేదని వచ్చిన ఫిర్యాదుల మేరకు వారు ఈ తనిఖీ నిర్వహించారు. అంగన్‌కేంద్రంలో రికార్డులు రిజిష్టర్ల పరిశీలించి ఆరోపణలపై విచారణ చేశారు. ఆరోపణలు వాస్తమని తేలిందని, దీంతో పాటు అంగన్‌వాడీ టీచర్ ఆయా ద్వారా సెంటర్‌ను నడిపిస్తున్నారని ఎంపీడీఓ శ్రీనివాసరెడ్డి తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారాన్ని సక్రమంగా అందించకపోతే అలాంటి వారిపై కలెక్టర్, సంబంధిత అధికారులకు నివేదించాల్సి వస్తోందని ఎంపీడీఓ హెచ్చరించారు.

కమ్యూనిటీ హాల్‌కు 20 సెంట్లు స్థలం కేటాయింపు



పిడుగురాళ్ల: శాలివాహన సంఘం కమ్యూనిటీ హాల్ నిర్మాణం కోసం ఎమ్మెల్యే కాసు మహేష్ రెడ్డి 20 సెంట్ల స్థలంను కేటాయించారు. ఈసందర్భంగా శాలివాహన సంఘం సభ్యులు మాట్లాడుతూ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి ఇటీవలే పట్టణంలోని మన్నెం పుల్లారెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శాలివాహన చక్రవర్తి విగ్రహాన్ని ఆవిష్కరించారని, వెంటనే తమ సంఘంకు కమ్యూనిటీ హాల్ కావాలని కోరడంతో పట్టణంలోని డపింగ్ యార్డు సమీపంలో శాలివాహన సంఘం కమ్యూనిటీ హాల్ కోసం 20 సెంట్ల స్థలం కేటాయించడం ఎంతో అభినందించదగిన విషయమన్నారు. శాలివాహన సంఘం ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి, వైఎస్సార్ సీపీకి ఎప్పుడు రుణపడి ఉంటుందని వారు తెలియజేశారు. కార్యక్రమంలో శాలివాహన సంఘం సభ్యులు పాల్గొన్నారు.

దళిత క్రైస్తవులను ఎస్సీ జాబితాలో చేర్చాలని వినతి



గురజాల : దళిత క్రైస్తవులను ఎస్సీ జాబితాలో చేర్చాలని మత రహిత రిజర్వేషన్ సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు ఎస్ జాన ప్రకాశ్ డిమాండ్ చేశారు. స్థానిక రెవెన్యూ డివిజనల్ కార్యాలయం వద్ద సోమవారం ధర్నా నిర్వ హించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో మతోన్మాదదాడులు కుట్రపూరితంగా చర్చిలపై పాస్టర్లపై దాడులు చేయడం అన్యాయమన్నారు. ఇటువంటి సంఘటన వల్ల ప్రజల్లో మత విద్వేషాలు పెరిగి మత సామరస్యతను కోల్పోయి రాజ్యాగ స్ఫూర్తి అయిన ప్రజాస్వామ్యానికి ప్రమాదమన్నారు. అనంతరం ఆర్డీఓకు వినతిపత్రం అందించారు. కా ర్యక్రమలో దళిత నాయకులు కలకండ ప్రకాశ్, టి థామస్, కె మహేష్, కె చంటి, పాముల రాజరత్నం, పాస్టర్ ఆదూరి మాణిక్యరావు, మాచర్ల మోషే, సైదులు పాల్గొన్నారు.

తప్పిపోయిన బాలికను తండ్రికి అప్పగించిన పోలీసులు



అమ్మాయిని తండ్రికి అప్పగిస్తున్న ఎస్‌ఐ అరుణ

మాచర్ల: పట్టణంలోని ఓ శుభకార్యానికి వచ్చిన అమ్మాయి తప్పిపోవడంతో వెంటనే అమ్మాయిని గుర్తించిన పోలీసులు సంబంధిత అమ్మాయి దగ్గర వివరాలు సేకరించి ఫంక్షన్ నిర్వహించే వారి సమాచారం తెలుసుకుని అమ్మాయిని తండ్రికి అప్పగించారు. పట్టణంలో రామాటాకీస్ ప్రాంతంలో జరుగుతున్న తన అక్క కూతురు ఫంక్షన్‌కు వచ్చిన లలిత తప్పిపోయింది. విషయాన్ని గమనించిన పోలీసులు ఆ బాలిక వివరాలు తెలుసుకుని పిడుగురాళ్ళకు చెందిన ఏడుకొండలు కుమార్తె అయిన లలితను పట్టణ సీఐ టి బాలకృష్ణ ఆధ్వర్యంలో వెతికి తీసుకొచ్చి తండ్రికి అప్పగించినట్లు పట్టణ ఎస్‌ఐ అరుణ తెలిపారు.

కూచిపూడి నాట్య విద్యార్థినుల ప్రతిభ

సత్తెనపల్లి: పట్టణంలోని శ్రీ తారక్ ఛత్రపతి నాట్య కళానిలయం కూచిపూడి నాట్య విద్యార్థులు హైదరాబాద్ లోని తెలంగాణ సారస్వత పరిషత్ నందు నిర్వహించిన విజయ మాధవి సంస్కృతిక సేవాసమితి వారి వండర్ బుక్ ఆఫ్ రికార్డులో పాల్గొని ప్రతిభ చూపారు. ప్రతిభ చూపిన విద్యార్థినులను పావని, దరణి, నిఖిత, లితికా, దివ్య శ్రీ, చరిష్మా, తులసి, యువహర్షి నీ, దీప్తి శ్రేయ, విస్మ్యాగ్న లను, గురువు తేనేటి కరుణాకర్‌లను అభినందించారు.

రాష్ట్రంలో సంక్షేమ విప్లవం

ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి



లబ్ధిదారురాలికి సంక్షేమ పథకాల కరపత్రాన్ని, అందజేస్తున్న ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి

దాచేపల్లి : ప్రజా సంక్షేమం వైఎస్సార్ సీపీ ప్రభుత్వంతోనే సాధ్యమని, సంక్షేమ పథకాల రథసారధి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో రాష్ట్రంలో సంక్షేమ విప్లవం కొనసాగుతుందని గురజాల శాసనసభ్యుడు కాసు మహేష్‌రెడ్డి అన్నారు. నగర పంచాయతీ పరిధిలోని 15వ వార్డులో గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమాన్ని సోమవారం ఎమ్మెల్యే కాసు చేపట్టారు. వార్డు పరిధిలో ఉన్న ప్రతి గడపకు వెళ్లి ప్రభుత్వం ద్వారా అందిన సంక్షేమ పథకాల గురించి లబ్ధిదారులకు ఎమ్మెల్యే కాసు వివరించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా లబ్ధిపొందిన లబ్ధిదారులు ప్రభుత్వ పనితీరును అభినందించారు. సంక్షేమ పథకాల కరపత్రాలను లబ్ధిదారులకు ఎమ్మెల్యే కాసు అందించారు. రాష్ట్రంలో కుల మతాలు, పార్టీ అసలే చూడకుండా అర్హతే ప్రామాణికంగా మధ్యవర్తుల ప్రమేయం లేకుండా సంక్షేమ పథకాలు నేరుగా లబ్ధిదారులకే అందేలా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పరిపాలనా సాగిస్తున్నారని ఎమ్మెల్యే కాసు చెప్పారు. ఈ రోజు రాష్ట్రంలో ఇంటి వద్దకే పింఛన్, ఇంటి వద్దకే రేషన్...ఇంటి వద్దకే సంక్షేమ పథకాలు అందజేస్తున్న ఏకైక ప్రభుత్వం మన అందరి ప్రభుత్వమని, అమ్మఒడి, జగనన్న విద్యాదీవెన, విద్యా కానుక, వసతి దీవెన పథకాలు విద్యార్థులకు వరంగా మారాయన్నారు. డ్వాక్రా అక్కాచెల్లెమ్మలకు ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉందని, వైఎస్సార్ అసరా..వైఎస్సార్ చేయూత, వైఎస్సార్ సున్నావడ్డీ జగనన్న తోడు పథకాల ద్వారా ఆర్థిక భరోసా కల్పించిన ఘనత మన ప్రభుత్వానికి మాత్రమే దక్కుతుందని ఎమ్మెల్యే కాసు తెలియజేశారు. నాడు–నేడు ద్వారా ప్రభుత్వ పాఠశాలలను అందంగా తీర్చిదిద్ది విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేలా ప్రభుత్వం పనిచేస్తోందని, మూడేళ్ల వైఎస్సార్ సీపీ ప్రభుత్వ పాలనాలో 95 శాతం హామీలను అమలు చేశామని ఆయన చెప్పారు. రూ.3.20 కోట్లతో రైల్వేస్టేషన్ రోడ్డుని అభివృద్ధి చేస్తున్నామని, నగర పంచాయతీని అన్ని విధాలుగా తీర్చిదిద్ది ఆదర్శ పట్టణంగా అభివృద్ధి చేస్తామని, ప్రజలకు ఇచ్చిన ప్రతి మాట నిలబెట్టుకునేలా పనిచేస్తామని ఎమ్మెల్యే కాసు అన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రజలకు ఎప్పుడు అందుబాటులో ఉంటూ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రజలకు అందేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే కాసు చెప్పారు. కార్యక్రమంలో నగర పంచాయతీ చైర్మన్ షేక్ ఖాదర్‌భాషా, వైస్ చైర్మన్ కొమెరబత్తిన అన్నపూర్ణ విజయ్‌కుమార్, మాజీ సర్పంచ్‌లు మందపాటి రమేష్‌రెడ్డి, బుర్రి విజయ్‌కుమార్‌రెడ్డి, మాజీ ఎంపీపీ కొప్పుల సాంబయ్య, మాజీ చైర్మన్ మునగా పున్నారావు, పార్టీ పట్టణ, మండల కన్వీనర్లు షేక్ సుభానీ, కోట కృష్ణ, జెడ్పీటీసీ మూలగొండ్ల ప్రకాష్‌రెడ్డి, మార్కెట్ యార్డు చైర్మన్ గొట్టిముక్కల పెదహనిమిరెడ్డి, మాజీ మండల కన్వీనర్ షేక్ జాకీర్‌హుస్సేన్, నాయకులు బత్తుల బయ్యన్న, కొమెరబత్తిన ఆనంద్‌కుమార్, ఓర్సు దుర్గారావు, మస్తాన్‌రావు, కొరట బోసు, పల్లపు వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీతోనే అన్ని వర్గాలకు సమన్యాయం

- మున్సిపల్ చైర్మన్ బోయ రఘురామిరెడ్డి
- జగన్‌కు జేజేలు పలుకుతున్న జనం
- సీఎం వైఎస్ జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం



సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న బోయ రఘురామిరెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ తురకా కిషోర్

మాచర్ల : రాష్ట్రంలో నాలుగు సంవత్సరాల కిందట ప్రజా సంకల్పయాత్రను పూర్తి చేసి ప్రజానాయకుడుగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల మనసుల్లో శాశ్వతంగా నిలిచిపోయారని మున్సిపల్ చైర్మన్ బోయ రఘురామిరెడ్డి, మాజీ చైర్మన్ తురకా కిషోర్‌లుఅన్నారు. సోమవారం పట్టణంలోని వైఎస్సార్ సీపీ క్యాంపు కార్యాలయంలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రజా సంకల్పయాత్ర పూర్తి చేసుకుని నాలుగు సంవత్సరాలు అయిన సందర్భంగా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ చరిత్రలో 3600 కిలోమీటర్లకు పైగా పాదయాత్ర చేసి ప్రజా సంకల్పయాత్రలో ప్రజల సమస్యలు తెలుసుకుని పేదవర్గాల నాయకుడుగా సీఎం జగన్ మోహన్‌రెడ్డి గుర్తింపు పొందారన్నారు. అందుకే రాష్ట్రంలో ప్రతి ఒక్కరూ సీఎం జగన్‌కు జేజేలు పలుకుతుంటే ఏదో ఒకరకంగా ప్రతిపక్షాలు ఏకమై ప్రజలను మోసగించేందుకు దుష్ప్రచారం చేస్తున్నారన్నారు. ఈ సందర్భంగా ముందుగా కేక్ కట్ చేసి అనంతరం సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేసి జేజేలు పలికారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ పోలూరి నరసింహారావు, మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ కొత్తమాసు పాండురంగారావు, మాజీ మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ జలీల్, మాజీ మార్కెట్‌యార్డు చైర్మన్ యరబోతుల శ్రీనివాసరావు, పట్టణ పార్టీ అధ్యక్షులు చుండూరు రోశయ్య, కౌన్సిలర్లు షేక్ మస్తాన్, కరిముల్లా, సుభాని, తేరాల సిద్ధయ్య, రామాంజిరెడ్డి, మాచర్ల సుందరరావు, మాచర్ల చిన్న ఏసోబు, మున్నా మురళి, మందా సంతోష్, ఎం.శ్రీనివాసరావు, కో ఆప్షన్ సభ్యులు అనంతరావమ్మ, అల్లి జీవన్, రాష్ట్ర లెదర్ కార్పొరేషన్ డైరెక్టర్ బూదాల మరియమ్మ, వైఎస్సార్ సీపీ నాయకులు అప్పి శ్రీను, షేక్ సులేమాన్‌పాషా, కలివెల సురేష్, గురుదేవమ్మ, కణితి మస్తాన్, మాజీ కౌన్సిలర్ వేముల కళ్యాణి తదితరులు పాల్గొన్నారు.

పెరిగిన చలి తీవ్రత



మంచు కురుస్తున్న వేళ కారెంపూడి సెంటర్

కారెంపూడి : పల్నాడులో సైతం సోమవారం చలి తీవ్రత పెరిగింది. తెల్లవారు జామున ఉష్ణోగ్రత 12 డిగ్రీలు మాత్రమే ఉంది. సూర్యోదయం అనంతరం అది 20 డిగ్రీలకు ఆ తర్వాత క్రమేణా నార్మల్‌కు చేరుకుంది. కురిసిన పొగ మంచులో తేమశాతం ఎక్కువగా ఉండడంతో చలిగాలులు వీచాయి. మోతాదుకు మించిన చలితో ప్రజలు ఇబ్బందులకు గురయ్యారు. వేకువజామున పొలాలకు వెళ్లే రైతు లు, రైతు కూలీలకు దారి మార్గాలు కూడా సరిగా కన్పించనంతగా మంచుకురిసింది. మిర్చి కోతలు, వరినాట్లు పనులకు వెళ్లిన కూలీలు చలితీవ్రత కారణంగా బాగా ఇబ్బందులు పడ్డారు. కారెంపూడితో పాటు మిగతా పల్నాడు ప్రాంతంలో కూడా ఈ రకమైన చలి వాతావరణం నెలకొంది. చెరువులు, కుంటల్లో నీరు పుష్కలంగా ఉండడం పంట కాల్వలలో నీరు పుష్కలంగా పారుతుండడం, మండలంలో రబీ వరి నాట్లు జరుగుతున్న క్రమంలో గాల్లో తేమశాతం కూడా బాగా పెరిగింది.

జెడ్పీహెచ్‌ఎస్‌లో బోరు బావి ఏర్పాటు



బోరును ప్రారంభిస్తున్న జెడ్పీటీసీ రూప్లీబాలునాయక్

వెల్దుర్తి: విద్యార్థుల దాహార్తిని తీర్చేందుకు శిరిగిరిపాడు జెడ్పీహెచ్‌ఎస్‌లో సోమవారం మండల పరిషత్ అధ్యక్షుడు చింతా శివరామయ్య, జెడ్పీటీసి రూప్లీబాలునాయక్‌లు బోరును ప్రారంభించారు. పాఠశాలలో విద్యార్థులు తాగునీటి కోసం ఇబ్బంది పడుతుండడంతో మాచర్ల ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి ఆదేశాల మేరకు బోరు బావిని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. వేసవి కాలంలో తాగునీటి కోసం ఇబ్బందులు లేకుండా ముందు జాగ్రత్త చర్యగా స్కూల్‌లో బోరు బావిని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో మండల పరిషత్ ఉపాధ్యక్షుడు అలుగుమల్లి సంజీవరెడ్డి, చింతా ఆదినారాయణ, సర్పంచ్ సపారపు లచ్చిరెడ్డి, గుండ్లపాడు సర్పంచ్ తోట శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ నాయకులు లింగాల రాఘవాచారి, కాటినేటి ప్రసాద్, గుంటక మార్కొండారెడ్డి, పీఏ ర్ఎఈ పాశం శ్రీనివాసరెడ్డి, పాఠశాల హెచ్‌ఎం నాగరాజ కుమారి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల సృజనాత్మకతను వెలికితీసేందుకే సైన్స్‌ఫెయిర్



ప్రతిభ చాటిన విద్యార్థినిలను అభినందిస్తున్న ఎంఈఓ అల్లి సురేష్

వెల్దుర్తి: ఇటీవల జరిగిన జిల్లా సైన్స్ ఇన్‌స్పైర్ ప్రతిభ కనబర్చిన విద్యార్థినులను ఎంఈఓ అల్లి సురేష్ అభినందించారు. మండలంలోని శిరిగిరిపాడులో ఉన్న గిరిజన ఆశ్రమ ఉన్నత పాఠశాల విద్యార్థినులు సైన్స్ ఇన్‌స్పైర్‌లో వరల్డ్ స్పేస్ టెస్ట్‌లో తులసీబాయి ప్రతిభ కనబరచి అవార్డు దక్కించుకుంది. అదే పాఠశాలకు చెందిన ఆర్ భారతి ఉమ్మడి గుంటూరు జిల్లాలో స్కూల్ గేమ్ ఆఫ్ ఫెడరేషన్ స్థాయిలో జరిగిన పోటీలో రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైంది. వీరిని గిరిజన సంక్షేమ శాఖాధికారిణి లోతేటి వరలక్ష్మి, మండల విద్యా శాఖాధికారి అల్లి సురేష్, ప్రధానోపాధ్యాయురాలు పద్మ, వార్డెన్ పోతురాజు, ఉపాధ్యాయినీలు అభినందించారు.

12న మండల సర్వసభ్య సమావేశం

దుర్గి: మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం ఈ నెల 12వ తేదీన గురువారం ఉదయం 10.30గం॥లకు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ గుప్తా తెలిపారు. ఎంపీపీ అధ్యక్షతన నిర్వహించే ఈ సమావేశానికి మండల పరిధిలోని ఎంపీటీసీలు, జెడ్పీటీసీలు, సర్పంచ్‌లు, మార్కెట్ యార్డు చైర్మన్, అన్నీ శాఖాధికారులు హాజరవుతున్నట్లు తెలిపారు. మండలంలో ప్రజా సమస్యలు, తాగునీటి సమస్య, గృహ నిర్మాణాల పై ఉపాధి హామీ పథకం తదితర సమస్యలు ప్రస్తావనకు రానున్నాయని తెలిపారు.

యరపతినేని ప్రధాన అనుచరులు అరెస్ట్

పిడుగురాళ్ల: మాజీ ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు ప్రధాన అనుచరులను పట్టణ పోలీసులు సోమవారం అదుపులోకి తీసుకున్నట్లు పట్టణ పోలీసులు తెలిపారు. గతేడాది డిసెంబర్ 31వ తేదీన పట్టణంలోని చింతలపూడి బాబు అనే వ్యక్తిపై టీడీపీకి చెందిన యరపతినేని ప్రధాన అనుచరులు దియా రామకృష్ణ, ఇంతియాజ్‌లపై చింతలపూడి బాబు ఫిర్యాదు చేయడంతో పట్టణ పోలీసులు దియా రామకృష్ణ, ఇంతియాజ్‌లను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. అయితే చింతలపూడి బ్రదర్స్ వెళ్లి చంద్రబాబునాయుడిని కలవడం, ఇక్కడ యరపతినేని శ్రీనివాసరావుకు, అతని అనుచరులకు నచ్చక వారిపై అనుచిత వ్యాఖ్యలు సోషల్ మీడియా పరంగా హల్‌చల్ చేశారని, ఇదేమిటని ప్రశ్నించేందుకు చింతలపూడి బాబుపై దాడి చేసి గాయపరిచారు. దీంతో చింతలపూడి బాబు పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో సోమవారం పట్టణ పోలీసులు దియా రామకృష్ణ, ఇంతియాజ్‌లను అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేశారు.


పట్టపగలే దొంగతనం

గురజాల : దొంగతనాలకు పగలు రాత్రి అన్న తేడా లేకుండా జరుగుతున్నాయి. పట్టపగలే ఇంట్లో ఎవరూ లేని సమయంలో చొరబడి దొంగతనం చేసిన ఘటన సోమవారం మధ్యాహ్నం చోటుచేసుకుంది. గురజాల పట్టణంలో బ్రాహ్మణ బజారులో నివాసం ఉంటున్న ఓర్సు వెంకటేశ్వర్లు దారాలు, గుండీలు దుకాణం నిర్వహిస్తున్నారు. సోమవారం మధ్యాహ్నం యధావిధిగా భోజనం చేసి భార్యభర్తలు ఇద్దరు దుకాణానికి వెళ్లి వ్యాపారం చేసుకుంటున్నారు. కొద్ది సేపటికి ఇంటికి వచ్చిన ఓర్సు వెంకటేశ్వర్లు తలుపులు తీసి చూడగా ఇంట్లో దొంగలు పడినట్లు గమనించి బీరువాను పరిశీలించగా బీరువాలో ఉన్న 50 గ్రాముల బంగారం, రూ.20 వేల రూపాయలు నగదును అపహరించుకుని వెళ్లినట్లు యజమాని తెలిపారు. వెంటనే స్థానిక పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేశారు. ఘటన స్థలాన్ని ఎస్‌ఐలు అశోక్ బాబు, బి అనంత కృష్ణలు పరిశీలించి ఇంట్లోలోకి ఎటునుంచి వెళ్లి దొంగతనానికి పాల్పడ్డాడు ఎటు నుంచి బయటకు వెళ్లాడు అన్న కోణాల్లో విచారణ చేపడుతున్నారు. ఘటన స్థలాన్ని క్లూస్ టీం వచ్చి వివరాలు సేకరిస్తోందని పోలీసులు తెలిపారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

అచ్చంపేట: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఉపాధ్యాయుడు తుమ్మా శౌరెడ్డి సూచించారు. మండలంలోని తాళ్ల చెరువు ఆర్‌సీఎం పాఠశాల ఆవరణలో సోమవారం విద్యార్థులతో ఆయన మొక్కలు నాటించారు.

భక్తిశ్రద్ధలతో ధనుర్మాస పూజలు



ప్రత్యేక అలంకరణలో శ్రీవారు



వడ్డవల్లిలో ప్రత్యేక అలంకరణలో శ్రీవారు

సత్తెనపల్లి: ధనుర్మాసాన్ని పురస్కరించుకుని పట్టణంలోని రైల్వే స్టేషన్ రోడ్‌లో గల వెంకటేశ్వర స్వామి దేవాలయం, వడ్డవల్లి శ్రీ రామాలయం శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయంలో భక్తులు భక్తిశ్రద్ధలతో సోమ వారం పూజలు నిర్వహిస్తున్నారు. వడ్డవల్లిలోని శ్రీవారికి అంగరంగ వైభవంగా గ్రామోత్సవం నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై స్వామివారి కృపకు పాత్రులయ్యారు. భక్తులకు ఎలాంటి ఆటంకం కలగకుండా ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

వైఎస్సార్, జగన్ హయాంలో పల్నాడు అభివృద్ధి

మంత్రి అంబటి రాంబాబు



సిమెంట్ రోడ్డును ప్రారంభిస్తున్న మంత్రి అంబటి రాంబాబు, ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి

దాచేపల్లి : నియోజకవర్గ అభివృద్ధిపై, దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించేందుకు ఎమ్మెల్యే కాసు కృషి చేస్తున్నారని మంత్రి అంబటి రాంబాబు చెప్పారు. చంద్రబాబు సీఎంగా ఉండి చేయలేని కాటేరువాగు ఆధునీకీకరణ పనులను సాధారణ ఎమ్మెల్యేగా ఉన్న కాసు సీఎం జగన్ సహకారంతో చేసి చూపించాడని, కాటేరువాగును ఆధునికీకరణ చేయడం వల్ల దాచేపల్లి పట్టణానికి వరద ముప్పు తప్పిందన్నారు. పల్నాడు జిల్లా దాచేపల్లి నగర పంచాయతీ పరిధిలో స్థానిక ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డితో కలిసి మంత్రి అంబటి సోమవారం పర్యటించారు. స్థానిక కొట్ల బజార్‌లో రూ. 2.50 కోట్లతో నిర్మించిన సిమెంట్ రోడ్డు, డ్రైనేజీలను ప్రారంభించి, నారాయణపురం ఆర్‌అండ్‌బీ బంగ్లా నుంచి నడికుడి సచివాలయం వరకు రూ .3.20 కోట్లతో నిర్మించనున్న రోడ్డు పనులకు స్థానిక ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డితో కలిసి మంత్రి అంబటి శంకుస్థాపన చేశారు. టీడీపీ ప్రభుత్వ హయంలో పల్నాడు ప్రాంతం వెనకబడి ఉంటే వైఎస్సార్ జగన్ పాలనాలో పల్నాడు ప్రాంతం అభివృద్ధి చెందుతుందని మంత్రి అంబటి రాంబాబు అన్నారు.

ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి మాట్లాడుతూ , 40 ఏళ్ల దాచేపల్లి పట్టణ ప్రజల కలను సిమెంట్ రోడ్డు వేసి తీర్చామన్నారు. రాష్ట్ర మంత్రి పర్యటనను అడ్డుకోవాలని జనసేన కార్యకర్తలు, నాయకులు రోడ్లపైకి రావడం ఎంత వరకు సమంజసమని ఎమ్మెల్యే కాసు ప్రశ్నించారు. కార్యక్రమంలో నగర పంచాయతీ చైర్మన్ షేక ఖాదర్‌భాషా, మాజీ చైర్మన్ మునగా పున్నారావు, మాజీ ఎంపీపీ కొప్పుల సాంబయ్య, మాజీ సర్పంచ్‌లు బుర్రి విజయ్‌కుమార్‌రెడ్డి, మందపాటి రమేష్ రెడ్డి, జెడ్పీటీసీ మూలగొండ్ల ప్రకాష్‌రెడ్డి, ఎంపీపీ కటకం జయ శ్రీబ్రహ్మానాయుడు, యార్డు చైర్మన్ గొట్టిముక్కల పెదహనిమిరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల, పట్టణ కన్వీనర్లు కోట కృష్ణ, షేక్ సుభానీ, వైస్ చైర్మన్ కొమెరబత్తిన విజయ్‌కుమార్, మాజీ మండల కన్వీనర్ షేక్ జాకీర్‌హుస్సేన్, ఎస్సీసెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పేరుపొగు రాజశేఖర్, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

నూతన ఇళ్ల పట్టాల పంపిణీ



6వ సచివాలయంలో ఇళ్ల పట్టాలను అందజేస్తున్న మున్సిపల్ వైస్ చైర్మన్‌లు షేక్ జైలాబ్దిన్, కొమ్ము ముక్కంటి, కౌన్సిలర్లు

పిడుగురాళ్ల: పట్టణ, గ్రామాల్లో ఎవరు ఇళ్లు లేదని బాధపడకూడదనే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని మున్సిపల్ వైస్ చైర్మన్‌లు షేక్ జైలాబ్దిన్, కొమ్ము ముక్కంటి అన్నారు. పట్టణంలోని 6వ సచివాలయ పరిధిలో 9, 16 కొత్తగా మంజూరైన ఇళ్ల పట్టాలు, చెరువు కట్ట బజారులోని 14వ సచివాలయం పరిధిలో కొత్తగా మంజూరైన ఇళ్ల పట్టాల పంపిణీ కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ వైస్ చైర్మన్‌లు షేక్ జైలాబ్దిన్, కొమ్ము ముక్కంటి మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పేదవారికి న్యాయం చేయాలనే సంకల్పంతోనే పని చేస్తున్నారన్నారు. రాబోయే రోజుల్లో కొత్తగా ఎవరైతే ఇళ్ల పట్టాలు పొందారే వారికి ఇళ్లు కట్టుకునేందుకు డబ్బులు కూడా అందించడం జరుగుతుందన్నారు. అంతేకాకుండా జగనన్న కాలనీలో ఎవరు ఇబ్బంది పడకుండా సీసీ రోడ్లు, వాటర్ సదుపాయం, పచ్చని వాతావరణం కల్పిస్తూ ఆహ్లాదకరమైన వాతావరణం నెలకొల్పుతున్నారన్నారు. కార్యక్రమంలో కౌన్సిలరుల కత్తెరపు వాసుదేవరెడ్డి, మాదాల కిరణ్‌కుమార్, తురకా ముక్కంటి, గర్నె నాగేశ్వరరావు, కొక్కెర శ్రీనివాసరావు, అన్నెం పద్మావతి, బంగారెరెడ్డి, చల్లా ఆవులయ్య, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

గ్రంథాలయ అభివృద్ధిలో భాగస్వాములు కావాలి

గుంటూరు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బత్తుల దేవానంద్



గ్రంథాలయానికి కేటాయించిన స్థలంను పరిశీలిస్తున్న జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బత్తుల దేవానంద్

పిడుగురాళ్ల: గ్రంథాలయ అభివృద్ధిలో ప్రతి ఒక్కరు భాగస్వాములు అవుదామని గుంటూరు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బత్తుల దేవానంద్ అన్నారు. పట్టణంలోని గ్రంథాలయాన్ని గుంటూరు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బత్తుల దేవానంద్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన పాఠకులు ఎక్కువ మంది హాజరు అయ్యే విధంగా గ్రంథాలయాలను మార్పు చేసుకోవాలని ఆయన అధికారులకు సూచించారు. రాబోయే రోజుల్లో మరింత సాంకేతికతో మనం గ్రంథాలయ నిర్వాహణ రాబోతుందని, సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆదిశగా అడుగులు వేస్తున్నారని ఆయన తెలియజేశారు. ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డిని ఆయన కలిసి దుశాలువాతో సత్కరించి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం గ్రంథాలయ నిర్మాణానికి ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి కేటాయించిన స్థలాన్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. పట్టణంలోని ఈ క్యాక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ ఇన్‌చార్జి సెక్రటరీ ఝాన్సీ లక్ష్మీ, సత్తెనపల్లి గ్రంథాలయ అధికారి వాణి, జిల్లా గ్రంథాలయ సంస్థ సిబ్బంది బ్రహ్మయ్య, పిడుగురాళ్ల గ్రంథాలయ శాఖ అధికారి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ట్రస్టు ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు



విజేతలకు బహుమతులను అందజేస్తున్న పల్నాడు హాస్పటల్ డాక్టర్ చింతలపూడి అశోక్‌కుమార్

పిడుగురాళ్లరూరల్: మండలంలోని బ్రాహ్మణపల్లి, కరాలపాడు గ్రామాల్లో చింతలపూడి చారిట్రబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ముగ్గులను పోటీలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పల్నాడు హాస్పటల్ డాక్టర్ చింతలపూడి అశోక్ కుమార్ హాజరై మాట్లాడుతూ సంస్కృతి, సాంప్రదాయాలు కరుమరుగైపోతున్నాయని, సంక్రాంతి పండుగ అంటే రైతుల ఇళ్లల్లోకి ధాన్యపు రాశులు వచ్చి, కొత్త అల్లులను ఇంటికి పిలిపించుకుని, బంధువులంతా ఆటపాటలతో సాంప్రదాయాలను మరిచిపోకుండా ఉండేందుకు నిర్వహిస్తారని ఆయన తెలియజేశారు. చింతలపూడి చారిట్రబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ ముగ్గుల పోటీలకు అనూహ్యమైన స్పందన వచ్చిందన్నారు. అనంతరం మొదటి బహుమతి వి. అనూష గెలుపొందగా మిక్సీని అందజేశారు. అదేవిధంగా రెండవ బహుమతి డి. అనూషకు శాండ్ విచ్ మేకర్, మూడవ బహుమతి లక్ష్మీకి కెటిల్‌ను అందజేశారు. కార్యక్రమంలో చింతలపూడి చారిట్రబుల్ ట్రస్టు సభ్యులు పాల్గొన్నారు.

మరోసారి సేవా గుణాన్ని చాటుకున్న వలంటీర్స్



గుంటూరు జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న లబ్ధిదారునకు పింఛన్ అందజేస్తున్న వలంటీర్ కోట రాజేష్

దుర్గి: ప్రభుత్వం అందజేస్తున్న వైఎస్సార్ పంఛన్ కానుకను లబ్ధిదారులకు అందజేయడంలో వలంటీర్ మరోసారి సేవా గుణాన్ని చాటుకున్నారు. మండల పరిధి ముటుకూ 2 సచివాలయం పరిధిలోని కంచరగుంట గ్రామానికి చెందిన కోట వెంకయ్య గత కొన్ని రోజులుగా గుంటూరు జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న స్థానిక గ్రామ వలంటీర్ కోట రాజేష్ తన సొంత ఖర్చులతో గుంటూరు వెళ్లి పింఛన్ అందజేశాడు. ప్రభుత్వ పింఛన్ పంపిణీ కార్యక్రమాన్ని గడువు పొడిగించడంతో ఉన్న అవకాశాన్ని ఉపయోగించుకుని తన సేవా గుణాన్ని చాటుకున్నాడు. ఈ సందర్భంగా లబ్ధిదారుడు కోట వెంకయ్య తన సంతోషాన్ని వ్యక్త పరుస్తూ సకాలంలో వచ్చిన పింఛన్ వైద్య ఖర్చులకు ఉపయోగపడతాయని ప్రభుత్వానికి వలంటీర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.